డయాబెటిస్‌తో గర్భాశయ క్యాన్సర్!

ఐసీఎంఆర్ హెచ్చరిక

న్యూఢిల్లీ, జూన్ 25: రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రించలేని విధంగా ఉంటే.. క్యాన్సర్‌బారిన పడే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ వచ్చే రిస్క్ ఉందని భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తాజాగా తెలిపింది. డయాబెటిస్ పట్ల మహిళలు జాగ్రత్తగా ఉండాలని, దీనిని నియంత్రించే చర్యలు సరిగా చేపట్టకపోతే ఆరోగ్యం ప్రమాదంలో పడటం ఖాయమని ఐసీఎంఆర్ నివేదిక పేర్కొన్నది. దీని ప్రకారం, క్యాన్సర్ కణాల వృద్ధికి డయాబెటిస్ కారణమవుతున్నది. అధిక బరువు, శరీరంలో వాపులు, ఇన్సులిన్ నిరోధకత (ఇన్సులిన్ ఉత్పత్తి అవుతున్నా క్రియాశీలంగా లేకపోవటం) మొదలైనవి గర్భాశయ క్యాన్సర్‌కు దారితీస్తాయి. దీనిబారిన పడకుండా ఉండాలంటే ఆహారపు అలవాట్లు మార్చుకోవాల్సి ఉంటుంది. శారీరక బరువు, డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకునేందుకు రోజూ వ్యాయామాన్ని ఎంచుకోవాలి. రాత్రిళ్లు ఎక్కువసేపు మెలకువగా ఉంటూ.. కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్లతో గడపటం మానుకోవాలి.

తెలుగు వ్యక్తికి దుబాయ్‌లో జాక్‌పాట్!

లక్కీడ్రాలో 2.25 కోట్ల ప్రైజ్‌మనీ

దుబాయ్: ఆంధ్రప్రదేశ్ నుంచి దుబాయ్ వెళ్లిన ఎలక్ట్రీషియన్ బోరుగడ్డ నాగేంద్రమ్ (46)ను అదృష్ట దేవత వరించింది. కొన్ని సంవత్సరాలుగా పొదుపు చేస్తున్న ఆయనకు దాదాపు రూ.2.25 కోట్లు నగదు బహుమతి లభించింది. సేవింగ్స్ స్కీమ్ చందాదారులకు లక్కీ డ్రా నిర్వహించగా, అందులో ఆయన విజేతగా నిలిచారు. నాగేంద్రమ్ మాట్లాడుతూ, తాను 2017లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వచ్చానని చెప్పారు. తన కుటుంబానికి, పిల్లలకు మంచి భవిష్యత్తును ఇవ్వాలనే ఆకాంక్షతో తాను ఇక్కడికి వచ్చానని చెప్పారు. తాను 2019 నుంచి నేషనల్ బాండ్స్‌లో పొదుపు చేస్తున్నానని తెలిపారు.

కేరళలో ప్రత్యేక 'మలబారు రాష్ట్రం' వివాదం

కోజికోడ్: సున్నీ యువజన సంఘం నేత ముస్తఫా ముందుపర చేసిన ప్రత్యేక 'మలబారు రాష్ట్రం' వ్యాఖ్యలు కేరళను కుదిపేస్తున్నాయి. మలప్పురంలోని స్కూళ్లలో 11వ తరగతిలో సీట్లు లేకపోవడాన్ని నిరసిస్తూ నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ ఇది ఇలాగే కొనసాగితే ప్రత్యేక 'మలబారు రాష్ట్రం' డిమాండ్ తెరపైకి వస్తుందని, అప్పుడు తమనెవరూ నిందించవద్దని హెచ్చరించారు. మలబారు రాష్ట్రం ఉంటే ఏమవుతుందని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై కేరళ బీజేపీ చీఫ్ కే సురేంద్రన్ తీవ్రంగా స్పందించారు. కేరళను విభజించాలని ముస్తఫా డిమాండ్ చేస్తుంటే సీఎం విజయన్, ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ కిక్కురుమనకుండా కూర్చున్నారని దుయ్యబట్టారు.

పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా తుపాకీ హింస

అమెరికా సర్జన్ జనరల్ డాక్టర్ వివేక్ మూర్తి

వాషింగ్టన్: అమెరికాలో తుపాకీ హింస ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా మారిందని ఆ దేశ సర్జన్ జనరల్ డాక్టర్ వివేక్ మూర్తి మంగళవారం చెప్పారు. ఓ వార్తా సంస్థకు మంగళవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, తుపాకీ హింస వల్ల మరణాలను తగ్గించడం కోసం కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆటోమేటిక్ రైఫిల్స్‌ను నిషేధించాలని, తుపాకులను కొనాలనుకునేవారి నేపథ్యాన్ని తనిఖీ చేయాలని తెలిపారు. తుపాకుల తయారీ పరిశ్రమను క్రమబద్ధీకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో తుపాకుల వినియోగంపై ఆంక్షలు విధించాలని చెప్పారు.

50 ఏండ్లలో తొలిసారి!

లోక్‌సభ స్పీకర్ పదవికి ఈసారి తప్పని ఎన్నిక

- ఏకగ్రీవం కోసం ఎన్డీయే ప్రయత్నాలు విఫలం
- 'డిప్యూటీ స్పీకర్' పోస్టు ఇవ్వాలన్న విపక్షాల కండీషన్‌ను ఒప్పుకోని అధికార కూటమి
- ఎన్డీయే నుంచి ఓంబిర్లా నామినేషన్ దాఖలు
- ఇండియా కూటమి నుంచి పోటీలో కే సురేశ్
- స్వతంత్ర భారతంలో మూడోసారి స్పీకర్ ఎన్నిక

న్యూఢిల్లీ, జూన్ 25: లోక్‌సభ స్పీకర్ పదవికి ఈ సారి ఎన్నిక అనివార్యమైంది. స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం చేసేందుకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు ప్రతిపక్షాలతో జరిపిన చర్చలు ఫలించలేదు. డిప్యూటీ స్పీకర్ పదవిని ఇవ్వాలన్న షరతుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో స్పీకర్ స్థానానికి విపక్ష ఇండియా కూటమి అభ్యర్థిని నిలిపింది. ఎన్డీయే కూటమి తరపున మాజీ స్పీకర్ ఓం బిర్లా పోటీ చేస్తుండగా, ఇండియా కూటమి తరపున సీనియర్ ఎంపీ కొడికున్నిల్ సురేశ్ బరిలో నిలిచారు. దీంతో గత 50 ఏండ్లలో తొలిసారిగా, స్వతంత్ర భారత చరిత్రలో మూడోసారి లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరుగనున్నది. వాస్తవానికి స్పీకర్ పదవిని అధికార పక్షం, డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షం చేపట్టడం సంప్రదాయంగా వస్తున్నది. అయితే గత పర్యాయంలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించలేదు. ఈసారి ఎన్నికల్లో మెరుగైన సీట్లు సాధించిన ఇండియా కూటమి డిప్యూటీ స్పీకర్ పదవి కోసం పట్టుబట్టింది. అందుకు కేంద్రం అంగీకరించకపోవడంతో స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలిపింది.

సంప్రదాయానికి అధికార బీజేపీ తిలోదకాలు

డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు కేటాయించాలనే సంప్రదాయాన్ని ప్రభుత్వం పాటించడం లేదని కేసీ వేణుగోపాల్ విమర్శించారు. గత లోక్‌సభను డిప్యూటీ స్పీకర్ లేకుండానే బీజేపీ నడిపిందని, అంతకుముందు తమ మిత్రపక్ష కూటమికి ఇచ్చిందని జైరాం రమేశ్ మండిపడ్డారు. మన్మోహన్ సింగ్, వాజ్‌పేయి, పీవీ నరసింహరావు హయాంలోనూ డిప్యూటీ స్పీకర్ పోస్టును విపక్షాలకు కేటాయించారని ఎక్స్ పోస్టులో గుర్తుచేశారు. కాగా, బాల్ ప్రభుత్వం కోర్టులోనే ఉన్నదని, విపక్షానికి డిప్యూటీ స్పీకర్ పోస్టు ఇచ్చేందుకు అంగీకరిస్తే, స్పీకర్ పోటీని ఉపసంహరించుకుంటామని కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, దీపేందర్ హుడా పేర్కొన్నారు. కాగా, విపక్ష పార్టీలు ఒత్తిడి రాజకీయాలు చేస్తున్నాయని, ముందస్తు కండిషన్లు పెడుతున్నాయని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు.

నంబర్ గేమ్‌లో ఓం బిర్లాకే మొగ్గు

వయనాడ్ స్థానానికి రాహుల్ గాంధీ రాజీనామా చేయడంతో ప్రస్తుతం లోక్‌సభలో 542 మంది ఎంపీలు ఉన్నారు. అధికార ఎన్డీయే కూటమికి 293 మంది సభ్యులు ఉండగా.. విపక్ష ఇండియా కూటమి ఎంపీలు 233 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయే అభ్యర్థి ఓం బిర్లాకు స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నది. ఆయన మరోసారి స్పీకర్‌గా ఎన్నికైతే, ఒక టర్మ్ కంటే ఎక్కువ సార్లు స్పీకర్ అయిన ఐదో వ్యక్తి అవుతారు.

మూడోసారి ఎంపీ ఓం బిర్లా

స్పీకర్ పోస్టుకు ఎన్డీయే కూటమి నుంచి నామినేషన్ వేసిన ఓంబిర్లా ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్‌లోని కోటా స్థానం నుంచి ఎంపీగా గెలిచారు. 2014, 2019ల్లోనూ ఆయన ఇదే స్థానం నుంచి వరుసగా గెలుపొందారు. 2019-24 టర్మ్‌లో అనూహ్యంగా లోక్‌సభ స్పీకర్ అయిన ఓంబిర్లా.. ఈసారి కూడా ఎన్నికలో గెలిస్తే, గత రెండు దశాబ్దాలకు పైగా కాలంలో రెండోసారి స్పీకర్ పదవి చేపట్టిన వ్యక్తి అవుతారు. ఎంపీ కాకముందు ఓంబిర్లా రాష్ట్ర అసెంబ్లీకి ఎమ్మెల్యేగా మూడు సార్లు ఎన్నికయ్యారు. 1991-2003 మధ్య బీజేవైఎంలో వివిధ హోదాల్లో పనిచేశారు.

2009లో సురేశ్ ఎన్నికను కొట్టేసిన హైకోర్టు

ఇండియా కూటమి నుంచి స్పీకర్ పదవికి పోటీచేస్తున్న కే సురేశ్ కేరళకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత. దళిత వర్గానికి చెందిన సురేశ్ 8 సార్లు ఎంపీగా గెలిచారు. 2009లో ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించారన్న కేసులో ఎంపీగా ఆయన ఎన్నిక చెల్లదని కేరళ హైకోర్టు ప్రకటించగా.. తర్వాత సుప్రీంకోర్టు ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించింది. కే సురేశ్ ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని మవెలిక్కర(ఎస్సీ) స్థానం నుంచి విజయం సాధించారు. 1989లో తొలిసారి అదూర్ స్థానం నుంచి ఎంపీగా గెలిచిన సురేశ్.. 2012-14 మధ్య కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు.

మమ్మల్ని సంప్రదించలేదు: టీఎంసీ

స్పీకర్ పోస్టుకు ఇండియా కూటమి సురేశ్‌ను అభ్యర్థిగా నిలబెట్టే విషయంలో తమ పార్టీని సంప్రదించలేదని టీఎంసీ పేర్కొనడం ఆసక్తికరంగా మారింది. పోటీపై టీఎంసీ వైఖరేంటి? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఆ పార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ స్పందిస్తూ 'మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. చర్చలు చేయలేదు. దురదృష్టవశాత్తూ ఇది ఏకపక్ష నిర్ణయం' అని పేర్కొన్నారు. సురేశ్‌కు మద్దతు విషయంపై తమ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నిర్ణయం తీసుకొంటారని అన్నారు. అయితే ఆ తర్వాత అభిషేక్ బెనర్జీతో పార్లమెంట్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ మాట్లాడటం కనిపించింది.

స్వతంత్ర భారతంలో మూడోసారి స్పీకర్ ఎన్నిక!

18వ లోక్‌సభకు అనివార్యంగా జరుగుతున్న కొత్త స్పీకర్ ఎన్నిక స్వతంత్ర భారతదేశ చరిత్రలో మూడోది అని, దాదాపు గత 50 ఏండ్లలో తొలిసారి అని పార్లమెంట్ వర్గాలు చెబుతున్నాయి. 1952 తర్వాత స్పీకర్ పోస్టుకు ఎన్నిక జరుగనుండటం ఇది మూడోసారి. లోక్‌సభ సెక్రటేరియట్ వివరాల ప్రకారం మొదటగా 1952 తొలి సార్వత్రిక ఎన్నికల తర్వాత జరిగిన స్పీకర్ ఎన్నికలో శంకర్ శాంతారాంపై జీవీ మౌలాంకర్ గెలిచారు. మౌలాంకర్‌కు 394 ఓట్లు రాగా, శాంతారంకు 55 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత 1976లో రెండోసారి బాలిరాం భగత్, జగన్నాథ్ రావ్ మధ్య అలాంటి పోటీ జరిగింది. 344-58 ఓట్ల తేడాతో జగన్నాథ్ రావ్‌పై భగత్ విజయం సాధించారు.

నినాదాల హోరు

- ప్రమాణం సందర్భంగా జోరుగా నినాదాలు
- అధికార, విపక్ష పార్టీల మధ్య దుమారం
- వివాదం రేపిన ఒవైసీ 'జై పాలస్తీనా' నినాదం
- పూర్తయిన 535 మంది ఎంపీల ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ: లోక్‌సభలో మంగళవారం సభ్యుల ప్రమాణ స్వీకారాలు కొనసాగాయి. సోమవారంతో కలిపి 542 మందికిగానూ 535 మంది ప్రమాణాలు చేయగా.. ఇంకా ఏడుగురు సభ్యులు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నదని లోక్‌సభ వర్గాలు వెల్లడించాయి. సభ్యుల ప్రమాణ స్వీకారాల సందర్భంగా పలు రకాల నినాదాలు ఇచ్చారు. జై హింద్, జై సంవిధాన్, జై జవాన్, జై కిసాన్, జై భీమ్, జై మండల్, జై మహారాష్ట్ర, జై శివాజీ తదితర నినాదాలు పలువురు సభ్యుల నోట నుంచి వినిపించాయి. దీంతో 'ఇచ్చిన పేపర్‌పై ఉన్నది మాత్రమే చదవండి' అని ప్రొటెం స్పీకర్ ఓ సందర్భంగా సభ్యులకు సూచించారు.

ఒవైసీ 'జై పాలస్తీనా' నినాదం

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రమాణం అనంతరం 'జై పాలస్తీనా' అని నినదిండంపై లోక్‌సభలో దుమారం రేగింది. ప్రమాణం చేసిన అనంతరం ఒవైసీ 'జై భీమ్, జై మీమ్, జై తెలంగాణ, జై పాలస్తీనా' అంటూ నినాదం ఇచ్చారు. దీనిపై అధికార సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కొంత సేపు ఈ అంశంపై సభలో గందరగోళం నెలకొన్నది. ప్రమాణ స్వీకారం కాకుండా మిగతా అంశాలు రికార్డుల్లోకి రావని స్పీకర్ చైర్‌లో కూర్చొన్న ప్రొటెం స్పీకర్ ప్యానెల్ సభ్యుడు రాధా మోహన్ సింగ్ పేర్కొన్నారు.

నీట్ మళ్లీ నిర్వహించాలని టీ షర్ట్‌తో పార్లమెంట్‌కు పప్పూయాదవ్

తెలుగులో తమిళనాడు ఎంపీ ప్రమాణం

లోక్‌సభలో తమిళనాడుకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గోపీనాథ్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేయడం ఆసక్తికరంగా మారింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కృష్ణగిరి నుంచి గెలిచిన గోపీనాథ్.. రాజ్యాంగం ప్రతిని చేతిలో పట్టుకొని తెలుగులో ప్రమాణం చేశారు. గోపీనాథ్ గతంలో పలుమార్లు తమిళనాడు అసెంబ్లీకి ఎమ్మెల్యేగా కూడా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో కూడా తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేయడంతోపాటు పలు అంశాలపై ఆయన తెలుగు భాషలోనే మాట్లాడేవారు.

జైల్లోనే కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన సీబీఐ

సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ విచారణకు ఒకరోజు ముందు పరిణామం

న్యూఢిల్లీ, జూన్ 25: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ సుప్రీంకోర్టులో బుధవారం విచారణకు రానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకొన్నది. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న ఆయన్ను సీబీఐ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో మంగళవారం అరెస్టు చేసింది. సీబీఐ అధికారులు సోమవారం జైల్లోనే కేజ్రీవాల్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. సీబీఐ కేజ్రీవాల్‌ను బుధవారం ట్రయల్ కోర్టులో ప్రవేశపెట్టనున్నదని సంబంధిత వర్గాలు తెలిపాయి. సుప్రీంకోర్టు నుంచి 100 శాతం బెయిల్ వస్తుందని భావిస్తున్న తరుణంలో కేంద్రం కుట్రలు చేస్తున్నదని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు.

బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే: మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. ఈడీ వేసిన సవాల్ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం మంగళవారం ఈ మేరకు తీర్పునిచ్చింది. ఈడీ సమర్పించిన వివరాలను పరిగణనలోకి తీసుకోవడంలో ట్రయల్ కోర్టు విఫలమైందని, కేజ్రీవాల్‌కు బెయిల్‌పై నిర్ణయం తీసుకొనే సమయంలో ఆలోచన చేయలేదని వెకేషన్ బెంచ్ పేర్కొన్నది.

లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఎంపికయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీ మంగళవారం ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్‌కు లేఖ పంపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష ఇండియా కూటమి పార్టీల ఫ్లోర్‌లీడర్ల సమావేశంలో ప్రతిపక్ష నేతగా రాహుల్‌ను ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకొన్నారు. ఇతర నియామకాలపై తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకొంటామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు.

అజిత్ వర్గం ఎమ్మెల్యేలకు తలుపులు తెరిచే ఉన్నాయి: శరద్ పవార్

ముంబై: ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకునే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలను పంపించారు. తమ పార్టీని బలహీనపరచాలనుకునే వారిని తిరిగి చేర్చుకోబోమని, పార్టీని బలోపేతం చేయడానికి ఉపయోగపడేవారిని మాత్రమే చేర్చుకుంటామని శరద్ పవార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పరాభవంతో అజిత్ వర్గంలోని కొందరు ఎమ్మెల్యేలు తిరిగి శరద్ పవార్‌తో కలిసి నడవాలనే యోచనలో ఉన్నట్టు ఊహాగానాలు వస్తున్నాయి.

నీట్‌లో మరో స్కామ్!

- మారుమూల కేంద్రాల్లో మాయాజాలం!
- మొదటిసారి రాస్తే లక్షల్లో ర్యాంకులు
- రెండోసారి రాసినప్పుడు వేలల్లోకి..
- 2023 నీట్ పరీక్షలో అనూహ్య ఫలితాలు
- మారుమూల పరీక్ష కేంద్రాల్లో ఏం జరిగింది?
- నీట్‌పై తెర మీదకు కొత్త అనుమానాలు

ముంబై, జూన్ 25: నీట్ పరీక్షలో అక్రమాలకు సంబంధించి కొత్త అనుమానాలు తెర మీదకు వస్తున్నాయి. నీట్ అక్రమాల వ్యవహారం ఈ ఏడాది మొదలయ్యింది కాదా, గతంలోనూ జరిగాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మొదటిసారి నీట్ పరీక్ష రాసి లక్షల్లో ర్యాంకులు సాధించిన కొందరు విద్యార్థులు రెండోసారి మాత్రం అనూహ్యంగా మెరుగైన ర్యాంకులు సాధించిన ఉదంతాలు బయటకు వస్తున్నాయి. ఇలా మంచి ర్యాంకులు సాధించిన వారిలో కొందరు ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. ఇలా రెండోసారి మంచి ర్యాంకులు సాధించిన కొందరు నగరాలకు దూరంగా మారుమూల పట్టణ ప్రాంతాల్లోని కేంద్రాల్లో పరీక్షలు రాయడం ఈ అనుమానాలకు బలం చేకూరుస్తున్నది.

రెండోసారి రిజల్ట్ మారిపోయిందెలా?

మొదటిసారి లక్షల్లో ర్యాంకులు సాధించి, రెండోసారి మాత్రం వేలల్లోకి ఎగబాకిన విద్యార్థులకు సంబంధించిన 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో ప్రచురితమైన కథనం కొన్ని ఉదాహరణలను ప్రస్తావించింది. ముంబైలోని ఎల్‌టీఎంజీ సియాన్ హాస్పిటల్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న ఓ విద్యార్థిని 2022లో మొదటిసారి నీట్ పరీక్ష రాసినప్పుడు రెండు లక్షలపైన ర్యాంకు సాధించింది. కానీ, రెండోసారి 2023లో పరీక్ష రాసి ఆమె 8 వేల ర్యాంకు దక్కించుకుంది. అలాగే, ముంబైలోనే ప్రభుత్వ దవాఖానలో ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతున్న మరో విద్యార్థికి 2022లో 10 లక్షలకు పైగా ర్యాంకు రాగా, 2023లో మాత్రం రెండో ప్రయత్నంలో 13వేల ర్యాంకు వచ్చింది. ఇలా రెండోసారి నమ్మశక్యం కాని విధంగా ర్యాంకులు మెరుగుపడ్డ విద్యార్థులు కొందరు వారు నివసించే నగరాలకు దూరంగా ఉండే చిన్న పట్టణాల్లోని పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయడం అనుమానాలకు తావిస్తున్నది. కొందరు కర్ణాటకలోని బెళగావి సమపంలో, మరికొందరు బీహార్‌లోని పట్నాకు కొంత దూరంలో ఉన్న ఒక చిన్న పట్టణంలో పరీక్ష రాశారని తెలుస్తున్నది. ఈ అంశంపై ప్రభుత్వం కూడా దృష్టి సారించినట్టు తెలుస్తున్నది.

నీట్ అక్రమాలపై లక్నోలో నిరసనకు దిగిన విద్యార్థులను లాక్కెళ్లుతున్న పోలీసులు

పరీక్షా కేంద్రాల్లోనే మతలబు?

నీట్ అక్రమాల వ్యవహారంలో కొన్ని పరీక్షా కేంద్రాల పాత్ర ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. గోద్రాలో నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయని గుజరాత్ పోలీసులు బయటపెట్టారు. ముందుగా విద్యార్థులను వారికి తెలిసిన ప్రశ్నలకు జవాబులు రాయమని, తెలియని వాటిని ఏమీ రాయకుండా వదిలేయమని చెప్పారు. ఆ తర్వాత పేపర్లను ప్యాక్ చేసే అర గంట ముందు విద్యార్థుల పేపర్లపై పరీక్ష కేంద్రం డిప్యూటీ సూపరింటెండెంట్ జవాబులు రాయాలనుకున్నారని పోలీసులు గుర్తించారు. సాధారణంగా గోద్రా పరీక్ష కేంద్రాన్ని సమీప ప్రాంతాల విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఎంచుకుంటారు. కానీ, వేర్వేరు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు గోద్రా పట్టణాన్ని పరీక్ష రాసేందుకు ఎంచుకోవడం అక్రమాలు జరిగాయనే వాదనకు బలం చేకూరుస్తున్నది.

700 మంది విద్యార్థులు.. రూ.300 కోట్లు

నీట్ పేపర్ లీక్ రాకెట్ టార్గెట్ ఇదే

'ఇండియా టుడే' స్టింగ్ ఆపరేషన్‌లో వెలుగులోకి కీలక విషయాలు

న్యూఢిల్లీ, జూన్ 25: నీట్ పేపర్ లీక్ కేవలం ఒక ప్రాంతానికి, ఐదారుగురు విద్యార్థులకు పరిమితమైనది కాదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వందల మంది విద్యార్థులకు పరీక్షకు ముందే పేపర్‌ను లీక్ చేసి వందల కోట్లు అర్జించాలని పేపర్ లీక్ చేసిన ముఠా లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు 'ఇండియా టుడే' చేసిన స్టింగ్ ఆపరేషన్‌లో బిజేందర్ గుప్తా అనే వ్యక్తి సంచలన విషయాలు బయటపెట్టాడు. బిజేందర్ 24 ఏండ్లుగా పేపర్ లీక్ మాఫియాలో ఒకడిగా ఉన్నాడు. వివిధ రాష్ట్రాల్లో పేపర్ లీక్ కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. నీట్ పేపర్ లీక్ అవుతుందని, 700 మంది విద్యార్థులకు పరీక్షకు ముందే పేపర్ ఇచ్చి రూ.200-300 కోట్లు సంపాదించాలని కొందరు లక్ష్యంగా పెట్టుకున్నారని బిజేందర్ గుప్తా మార్చిలోనే చేసిన వ్యాఖ్యల వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో స్టింగ్ ఆపరేషన్‌లో బిజేందర్ గుప్తా పేపర్ లీక్‌కు సంబంధించి కీలక విషయాలు వెల్లడించాడు. పేపర్ లీక్ చేయడానికి అనేక పద్ధతులు పాటిస్తామని, పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించే బాక్సులను రవాణా సమయంలోనే పగలగొట్టి పేపర్లను ఎక్కువగా లీక్ చేస్తుంటామని బిజేందర్ చెప్పాడు. ప్రింటింగ్ ప్రెస్ నుంచి కూడా పేపర్ లీక్ చేస్తామని, ప్రభుత్వంలో పైస్థాయి వ్యక్తుల ద్వారా కూడా చేస్తామని తెలిపాడు.

బిజేందర్ గుప్తా

జైలు.. బెయిల్.. మళ్లీ ఆట మొదలు

ఏదైనా తప్పు చేసి బ్లాక్‌లిస్టులోకి చేరిన సంస్థలు మళ్లీ కాంట్రాక్టులు పొందుతున్నాయని, తద్వారా పేపర్ లీకేజీలు జరుగుతున్నట్టు బయటపెట్టాడు. నీట్ పేపర్ లీక్ కేసులో కీలక పాత్రధారిగా ఉన్న సంజీవ్ ముఖియా గురించి కూడా బిజేందర్ గుప్తా పలు విషయాలు వెల్లడించాడు. సంజీవ్ మొదట బ్లూటూత్ ద్వారా పరీక్ష రాసే విద్యార్థులకు సమాధానాలు చెప్పేవాడని, ఇప్పుడు అతడు రూ.20 - 30 కోట్ల మేర అప్పుల్లో ఉన్నాడని చెప్పాడు. అతడి కొడుకు శివ్ బీహార్‌లో ఉపాధ్యాయ నియామక పరీక్ష పేపర్ లీక్ కేసులో జైలులో ఉన్నాడని తెలిపాడు. 'జైలుకు వెళ్లడం, బెయిల్ తెచ్చుకోవడం, మళ్లీ ఆట మొదలు పెట్టడం జరుగుతూనే ఉంటుంది. ఎంతకాలం జైలులో పెట్టగలరు?' అంటూ అతడు బిజేందర్ ప్రశ్నించాడు. సంజీవ్ ముఖియా పోలీసులకు దొరకడని ధీమాగా చెప్పాడు. కాగా, 700 మంది విద్యార్థులకు నీట్ పేపర్ ఎలా వెళ్లిందని అడగగా.. ఢిల్లీ, పట్నాతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో 300 మంది విద్యార్థులు ఉంటారని తెలిపాడు. మూడు నాలుగు ప్రాంతాలకు బృందాలను పంపారని, అక్కడి నుంచి పేపర్ లీక్ అయ్యిందని చెప్పాడు.

ఇంటి పేరు వేరైనా టికెట్ బుక్ చేయొచ్చు

స్పష్టత ఇచ్చిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ, జూన్ 25: ఐఆర్‌సీటీసీలో వ్యక్తిగత అకౌంట్ ఉన్న వారు వేరే ఇంటి పేరు ఉన్న వారికి టికెట్లు బుక్ చేయడాన్ని నిషేధించినట్టు జరుగుతున్న ప్రచారం అబద్ధమని రైల్వే శాఖ అధికార ప్రతినిధి తెలిపారు. ఈ ప్రచారంపై 'ఎక్స్' వేదికగా స్పష్టత ఇచ్చారు. వేరే ఇంటి పేర్లు ఉన్నప్పటికీ తమ మిత్రులు, బంధువులకు ఐఆర్‌సీటీసీలో వ్యక్తిగత అకౌంట్ కలిగిన వారు టికెట్లు బుక్ చేయవచ్చని పేర్కొన్నారు. వీరు నెలకు 12 టికెట్లు బుక్ చేయవచ్చని, ఆధార్ అథెంటికేషన్ అయిన అకౌంట్ కలిగి ఉంటే నెలకు 24 టికెట్ల వరకు బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

కక్షిదారులకు సీజేఐ సూచన

న్యూఢిల్లీ: పెండింగ్ కేసుల పరిష్కారం కోసం వచ్చే నెల 29 నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక లోక్ అదాలత్‌లో పాల్గొనాలని కక్షిదారులకు, న్యాయవాదులకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా వచ్చే నెల 29 నుంచి ఆగస్టు 3 వరకు సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నదన్నారు. అత్యంత సాధారణమైన, టెక్నాలజీ ఆధారిత పరిష్కారాలకు లోక్ అదాలత్ ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. కక్షిదారులు పూర్తి స్వచ్ఛందంగా, పరస్పర అంగీకారంతో, సంతృప్తికరంగా కేసులను పరిష్కరించుకునేందుకు ఇది దోహదపడుతుందన్నారు.

కెన్యా పార్లమెంట్‌కు నిప్పు

పన్ను పెంపు బిల్లుపై నిరసన జ్వాలలు.. పోలీసుల కాల్పుల్లో 10 మంది మృతి

నైరోబీ: పన్నులు పెంచుతూ కెన్యాలో పాలకులు తీసుకొచ్చిన ప్రతిపాదిత ఫైనాన్స్ బిల్లు (2024-25) ఆ దేశాన్ని కుదిపేస్తున్నది. బిల్లుకు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన నిరసనలు, ఆందోళనలు మంగళవారం తీవ్రరూపం దాల్చాయి. రాజధాని నైరోబీ సహా దేశంలోని పలు నగరాలు, పట్టణాల్లో నిరసనలు హోరెత్తాయి. పన్ను పెంపు బిల్లును పార్లమెంట్ ఆమోదించిందని తెలియగానే, ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకొని ఏకంగా పార్లమెంట్ భవనానికే నిప్పు పెట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు నిరసనకారులపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో కనీసం 10 మంది నిరసకారులు చనిపోయినట్టు తెలిసింది. పార్లమెంట్ వద్ద నిరసనకారులు, పోలీసులకు మధ్య ఘర్షణ తీవ్రస్థాయికి చేరుకుంది. నిరసనకారులు తొలుత పార్లమెంట్ ప్రాంగణాన్ని ముట్టడించే యత్నం చేయగా, పోలీసులు వారిపై వాటర్ కెనాన్లు, టియర్‌గ్యాస్‌లను ప్రయోగించారు. గుంపును చెదరగొట్టే ప్రయత్నాలు విఫలం కావటంతో కాల్పులు జరపాల్సి వచ్చిందని పోలీసు అధికారులు ప్రకటించారు.

బ్రిటన్ జైలు నుంచి అసాంజే విడుదల

- *నేడు కోర్టులో హాజరు.. ఆపై ఆస్ట్రేలియాకు పయనం*
- *నేరాంగీకారానికి అమెరికాతో ముందస్తు ఒప్పందం*

లండన్, జూన్ 25: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే ఎట్టకేలకు జైలు నుంచి విడుదలయ్యారు. అమెరికా ప్రభుత్వం మోపిన గూఢచర్యం అభియోగాలు ఎదుర్కొంటున్న అసాంజే 2019 నుంచి లండన్‌లోని ఓ జైలులో ఉన్నారు. అమెరికాతో జరిగిన ముందస్తు ఒప్పందం ప్రకారం అసాంజేను పసిఫిక్ మహాసముద్రంలోని మరియానా దీవులకు తరలిస్తారు. సైపాన్ నగరంలోని ఓ కోర్టులో బుధవారం ఆయనను ప్రవేశపెడతారు. అక్కడ అసాంజే తన నేరాన్ని అంగీకరించిన అనంతరం ఆయనను తన స్వదేశమైన ఆస్ట్రేలియాకు తరలిస్తారు. ఇంతకాలం లండన్‌లో శరణార్థులుగా ఉన్న అసాంజే సతీమణి, ఆయన పిల్లలు మంగళవారం ఆస్ట్రేలియా బయలుదేరి వెళ్లారు.

చరిత్ర సృష్టించిన చాంగే-6

చంద్రుని ఆవలి భాగం మట్టి నమూనాలతో భూమికి తిరిగొచ్చిన చైనా లూనార్ ప్రోబ్

బీజింగ్, జూన్ 25: చంద్రుని ఆవలి భాగం ఉపరితలాన్ని పరిశోధించేందుకు గత నెలలో చైనా ప్రయోగించిన 'చాంగే-6' లూనార్ ప్రోబ్ అక్కడి మట్టి నమూనాలను తీసుకుని విజయవంతంగా భూమికి తిరిగొచ్చింది. ఉత్తర చైనాలోని ఇన్నర్ మంగోలియా ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల 7 నిమిషాలకు చాంగే-6 రిటర్న్ క్యాప్సూల్ ల్యాండ్ అయినట్టు చైనా జాతీయ ఖగోళ పరిశోధన సంస్థ (సీఎన్ఎస్ఏ) వెల్లడించింది. దీంతో చంద్రుని ఆవలి భాగం మట్టి నమూనాలను భూమికి తీసుకొచ్చిన తొలి దేశంగా చైనా రికార్డులకెక్కింది. ఇప్పటివరకు దక్షిణ ధృవాన్ని ఏ దేశం అన్వేషించలేదు. 'చాంగే-6' లూనార్ ప్రోబ్ గత నెల 3న భూమి నుంచి బయల్దేరి జూన్ 2న చంద్రుని దక్షిణ ధృవంలోని అయిట్కిన్ (ఎస్‌పీఏ) బేసిన్‌లో దిగింది.